
పరమ హంస పరివ్రాజకాచార్యులు

స్వామి విరజానంద సరస్వతి



ఆర్య యువక పరిషత్ ఆంధ్రప్రదేశ్.

సికింద్రాబాదు.

పరమహంస పరివ్రాజకాచార్యులు

స్వామి విరజానంద సరస్వతి



లేఖకులు : రఘునాథ్‌ప్రసాద్ పాఠక్.

అనువాదకులు : లోక లక్ష్మీనారాయణ, ఎం. ఏ. బియడ్.

ప్రకాశకులు :

ఆర్య యువక పరిషత్ ఆంధ్రప్రదేశ్.

7-1-963 శంకరవీధి, సికింద్రాబాదు.

ప్రథమ ముద్రణ : 2000 ప్రతులు.

సిద్ధార్థి శ్రావణ పౌర్ణిమ.

ఆగష్టు 1979.

వెల : **0-60** పైసలు.

ఫోన్ 76939

ముద్రణ :

యస్. వి. బి. వర్క్స్, శంకరవీధి, సికింద్రాబాదు 500003,

ము న్నుడి

ఫ్రాన్సు దేశపు సుప్రసిద్ధ మనీషి,-సాహిత్యకారుడైన రోమారోలా "భారత దేశ భవిష్యద్దర్శకులు" అను తన పుస్తకము పేజీ 99న గురుదేవులు-విరజానందుల వారి చరిత్రను వర్ణించుచు ఇలా వ్రాసారు.

"దయానందునికి మథురలో" ఒక వృద్ధ గురువులభించెను. ఆయన సామాజిక దౌర్బల్యములను, చెడుగులను ఖండించుటలో-అంధ విశ్వాసములను మరియు కపట పాఖండ నిర్మూలనలోను, సత్యమును భూషించుటలోనూ దయానందుణ్ణిమించిన సునిశితుడైన తీవ్రవాది. ఆయన సన్యాసి, బాలాంధుడు, ప్రపంచములో అతనికి నా అను వారు లేకుండిరి. మహా విద్వాంసుడు-తీక్షణ స్వభావము కలవాడు. ఆయన పేరు విరజానంద సరస్వతి.

స్వామి విరజానందుడు అంధత్వముతో గ్రసితుడై తాను స్వయముగా పూరించలేని దానిని పూరించుటకు ఎట్టి బంధనములకు లోనుగాని ఒక అద్భుత వ్యక్తిని నిర్మాణము చేయు కుతూహలము కలిగియుండెను. అట్టి తనచే ఆవిష్కరింపబడిన అమోఘ అస్త్రము శత్రుకోటలను ఆక్రమించి శాశ్వతముగా నేల మట్టము చేయుటకు తలంచెను. ఆ ఆశతోనే ఆయన కృషిచేసాడు. అందుకొఱకే బ్రతికాడు, తన ఆత్మనే-అనగా ఆయనలోని భావములనే తన శిష్యులలో నింపుటకు ప్రాణములొడ్డి కృషిచేసాడు.

ఇంగ్లాండు మహారాణి మేరీ కాలమున మతశోషణ అవధులు దాటినపుడు లండన్ వాస్తవ్యుడగు లాటీమర్ మరియు

రిడ్లే అనెడి మతాధికారులను సజీవదహనము చేయుటకు ఇరువు రిని ఒకే స్తంభమున కట్టివేసినపుడు, ఆ వృద్ధ లాటీమర్, యువ కుడైన రిడ్లేను ఓదార్చుచు ఇలాఅన్నాడు "నేడు మనము రోమన్ రాజ్య శక్తి సమస్తము ఆర్పలేనట్టి అగ్నిని ప్రజ్వలింప జేయు చున్నాము".

గురుదేవ విరజానందులు కూడా తన శిష్యులతో ఇట్లాగే అంటుండేవారు. ఏమిటంటే—"నేను మీలో ఈనాడొక అగ్నిని ప్రజ్వలింప జేయుచున్నాను, అది సమస్త భ్రాంతి యుక్త ఆలో చనలను మరియు మూఢనమ్మకాలను భస్మీ పటలముచేయగలదు."

వారు దివ్య దృష్టి కలవారు, వారికి శిష్య దయానందుని రూపములో సుయోగ్యుడగు యోధుడు లభించాడు. ఆయనకే తన అమోఘ అస్త్రమును ప్రదానము చేసాడు. తద్వారా ఆయన అసత్యము మరియు అధర్మపు కోటలను ముట్టడించి వానిని ధ్వంసము చేసాడు.

గురుదేవుని ఈ మహోపకారమునకు భారతీయులే కాక ప్రపంచీయులెల్లరు మేలుబడసిరి. అందుకు కోట్లాది హృదయాలు ఆయనను లోలోనే అభినందించగలవు.

—రాంగోపాల్ శాల్వాలే. ఢిల్లి.

ఓ౩మ్

పరమహంస పరివ్రాజకాచార్యులు

స్వామి విరజానంద సరస్వతి

ప్రజ్ఞాచక్షువైన స్వామి విరజానంద సరస్వతి గారు జలంధర్ జిల్లాలోని కర్తార్‌పూర్‌కు సమీపమున గల గంగాపుర మనెడు గ్రామమున భారద్వాజ గోత్రీయులైన ఒక బ్రాహ్మణ కుటుంబమున క్రీ.శ. ౧౭౭౮ లో జన్మించిరి. వీరి జనకులు పం. నారాయణదత్త భరద్వాజగారు, సంస్కృత పండితులు. ఐదేండ్ల ప్రాయముననే విరజానందుడు మశూచికి గురియై కంటి చూపును కోల్పోయెను. దీనికి తోడుగా అనతి కాలముననే క్రూర విధి అతనిని మాతృ, పితృవియోగమునకు గురిచేసి వారి ప్రేమ నుండి వంచితు నొనర్చెను. తల్లిదండ్రులు మరణించినందున అతడు తన అన్నావదినెల దయాదాక్షిణ్యములపై నాధారపడ వలసిన వాడాయెను. వారు ఇతనియెడ అతి క్రూరముగా ప్రవర్తించిరి. వారి దుర్వ్యవహారము, ఇతని ఉగ్రస్వభావము ఈ రెండును అతడు ఇల్లు వదలిపోవుటకు కారణము లయ్యెను.

ఆ కాలమున నేటివలె ప్రయాణ సౌకర్యము లేవియు లేకుండెను. ౧౧ సంవత్సరముల అంధబాలుడైన విరజానందుడు కాలినడకనే ఒంటరిగా తన యాత్ర కొనసాగించెను. నిర్జన మార్గములు, వంతెనలు లేని నదులను దాటుచు ఘోరారణ్యాము లలో పయనించుట ఎంత భయంకమైన విషయమో ఊహింప వచ్చును. కాని ఇంతటి దురదృష్టములోనూ ఈశ్వరుని అభయ హస్తము, అతని ఉజ్జ్వలమైన భవిష్యత్తు గుప్తముగా తమ కార్యమును నిర్వర్తించుచుండెను. ఈ యనాథబాలుడు ఒకనాడు

తన ప్రకాశమును విస్తరింపజేయుచు సంస్కృత మహాపండితు లలో తన స్థానము నేర్పరచుకోగలడని ఎవ్వరు నూహింపలేదు. అటు నిటు తిరుగుచూ దీర్ఘప్రయాణము లొనర్చి మూడేండ్ల పిదప అతడు ఋషీకేశము చేరుకొనెను.

విరజానందునికి తండ్రి ద్వారానే ప్రాథమిక విద్య సంస్కృతములో లభించియుండెను అతడు అల్పవయస్సులోనే అమరకోశము, పంచతంత్రము మున్నగు అనేక సంస్కృత గ్రంథములను కంఠస్థ మొనర్చెను. అతడు సంస్కృతములోనే మాట్లాడుచుండెడి వాడు. ఋషీకేశములో అతడు తాపసిక జీవనము గడుపుచు మూడు సంవత్సరములు నివసించెను. ప్రతి దినము గంగానదిలో నిలబడి ఎన్నియో గంటలకాలము గాయత్రీ మంత్రము జపించెడివాడు. కందమూల ఫలములే అతని ముఖ్యాహారము, అతడు భిక్షాటన మెన్నడును చేయలేదు. అది అతని స్వభావమునకు విరుద్ధము. కాని ఎప్పుడైనా ఎవరైనా భోజన మిడినచో స్వీకరించెడివాడు. ఒకొక్కప్పుడు కొన్ని దినముల వరకు ఆహారము లేకుండానే గడిపెడివాడు.

ఒకనాటి రాత్రి అతడు గాఢనిద్రయందుండగా "బాలకా! ఇచటి నుండి వెడలిపో, నీకు జరుగవలసినంత నష్టముజరిగినది" అనెడి మాటలు వినిపించెను. అతడు మేల్కొని ఆ మాటలు పలికిన వారికై తన కుటీరమంతయు వెదకెను. కాని ఎవరును కనిపించలేదు. దీనిని దివ్యవాణిగా భావించి ఉదయముననే ఋషీకేశము వదలి హరిద్వారమునకు వెళ్లిపోయెను.

అతడు హరిద్వారమున నాల్గు సంవత్సరములుండెను. అచటనే సుప్రసిద్ధ సంస్కృత విద్వాంసులైన స్వామి పూర్ణానందుల వారిని కలిసికొనెను. వారే ఇతనికి సన్యాస దీక్షనొసగి స్వామి విరజానందులని పేరిడిరి. వారు స్వామి విరజానందులకు సంస్కృత వ్యాకరణము చదివించి, అష్టాధ్యాయి మరియు ఇతర ఆర్ష గ్రంథముల పట్ల వారి హృదయమున శ్రద్ధానురాగములను కలిగించిరి. స్వామి విరజానందులు వ్యాకరణమున ప్రవీణులైన పిదప కావ్యాదులందును నిష్ణాతులై, అధ్యయనముతో బాటు అధ్యాపనము గూడ చేయసాగిరి. వ్యాకరణములో ప్రావీణ్యత సంపాదించిన పిదప గురుదేవుల ప్రేరణపొంది మహాభాష్యము చదువుటకై కాశికి పోయిరి.

కాశిలో వారు దాదాపు పది సంవత్సరములుండిరి. అచట వారు మహాభాష్యము, మీమాంస, వేదాంతము మరియు ఆయుర్వేద విద్యల నధ్యయన మొనర్చిరి. అధ్యయనముతో బాటు అధ్యాపనమును గూడ కొనసాగించిరి. అనతికాలములోనే వారి కీర్తి కాశీపట్టణమున వ్యాపించెను. వారందరికిని ప్రీతిపాత్రులైరి. వారు కాశీలో గల కొద్దిమంది సంస్కృత మహాపండితులలో నొకరుగా వాసికెక్కిరి. వారు సంస్కృతములోనే మాట్లాడుచుండిరి. వారి బుద్ధి నిశితమైనది. స్మరణశక్తి అద్భుతమైనది. గూఢాతిగూఢ విషయములను కూడ సులభముగా గ్రహించి, ఇతరులను గ్రహింపజేసి అగాధమైన శాస్త్రజ్ఞానమును వ్యాఖ్యాన పటిమను ప్రదర్శించెడివారు, శాస్త్ర చర్చలో ప్రత్యర్థులను చిత్తుగా ఓడించి తమ శిష్యులకును, ప్రశంసకులకును పూర్ణానందమును చేకూర్చెడి వారు.

వారు కాశీనుండి గయకు వెళ్లి అచట నాల్గు సంవత్సరము లుండిరి. దారిలో వారిపై దొంగలు ఆక్రమణ జరిపిరి. వారి యీ దుష్కృత్యమును నిందించుచు సంస్కృతములో "మీరు ధనము, బంగారమునకై యిట్టి దుష్కార్యమునకు పాల్పడితిరి. మీరు మూర్ఖులు. వట్టి చేతులతోనే తిరిగి పోవలసివచ్చును"అనిరి.

వారి యీతిరస్కారము పనిచేసెను. దొంగలకు తమ తప్పిదము తెలిసెను. కాని వారు స్వామీజిని దుర్భాషలాడుచు అవమానింప దొడగిరి. సమీపములోనే గ్వాలియర్ అధిపతి శిబిరముండెను. స్వామీజీ కేకలు విని వారు తమ సేవకులనటు పంపిరి. సేవకులనుచూచి దొంగలు పారిపోయిరి. సేవకులడిగిన ప్రశ్నలన్నింటికి స్వామీజీ సంస్కృతములోనే సమాధాన మొసగుచుండిరి. ఆ భాష అర్థముకాక వారు తిరిగివెళ్లి తమ యజమానికి ఆ విషయము తెలుపగా వారు తమ పండితుని పంపిరి. ఆ పండితుడు స్వామీజీని తమ యజమాని వద్దకుతీసుక వచ్చెను. అంధుడైన స్వామీజీ సంస్కృతములో అనర్గళముగా భాషించుట గ్వాలియర్ అధిపతికి ఆశ్చర్యము కలుగజేసెను. వారు కడుభక్తి శ్రిద్ధలతో స్వామీజీకీ ఆతిథ్యమొసగి ఐదు దిన ములు తమ వద్దనే యుంచుకొనిరి.

స్వామీజీకి గయలో మహోత్కృష్టమైన వేదాంత దర్శన గ్రింథములు చదువు అవకాశము లభించెను. హరిద్వారములో ప్రారంభించిన ఉపనిషత్తుల అధ్యయనము కాశీలో ముగిసెను. వాని సూక్ష్మపరిశీలన గయలో జరిగెను. అప్పటికి వారివయస్సు 33 సంవత్సరములు.

వారు గయనుండి కలకత్తా వెళ్లిరి. ఆ కాలమున కలకత్తా నగరము సంస్కృత విద్వాంసుల దుర్గముగానుండెను. అచట స్వామీజీ సాహిత్య దర్పణము, కువలయానందము, కావ్య ప్రకాశము, రసగంగాధరము, న్యాయదర్శనము మున్నగు ఉత్కృష్ట సంస్కృత గ్రంథముల అధ్యయనాధ్యాపనముల నొన రించిరి. వారు చాల సంవత్సరములు కలకత్తాలో నివసించిరి. అచట అనేక మహాపురుషులతో వారికి సంబంధమేర్పడెను. వారు స్వామీజీని కలకత్తాలోనే స్థిరపడిపొండని బలవంతపెట్టిరి. వారికి నివాస, భోజన, ప్రయాణాది సౌకర్యములు కలిగించి సేవకుల వ్యవస్థ చేయబూనిరి. కాని స్వామీజీ ఒక చోట స్థిరముగా నుండుట కిచ్చగింపరైరి. వారు కలకత్తా వదలి గంగాతీరమున పర్యటించుచు ఏటా జిల్లాలోని సోరోఁపట్టణమునకు జేరుకొనిరి.

గంగానదీ తీరమున ప్రశాంతమైన ఏకాంత స్థానమున స్థిరపడి ధర్మశాస్త్రముల నధ్యయనము చేయదలచి అట్టి స్థానము నకై అన్వేషింపసాగిరి. సోరోఁలో కొన్ని దినములు గడిపి గంగాతీరమున గల గడియాఘాటు చేరుకొని అచట నివసించుట కేర్పాట్లు చేసికొని పఠనపాఠన క్రమమును కొనసాగించిరి. ఒక నాడు వారు గంగా ప్రవాహమధ్యమున నిలబడి విష్ణుస్తోత్రము చేయుచుండగా అచటికి తీర్థయాత్ర కరుదెంచిన అల్వార్ మహా రాజు వినయసింహుడు విని వారి మధురస్వరము మరియు గంభీర వ్యక్తిత్వముచే ప్రభావితుడై స్వామీజీ నదినుండి బయటికివచ్చు వరకు నిలిచియుండి వారిని తనతో అల్వార్ రమ్మని ప్రార్థించెను. అపుడు స్వామీజీ "మీరు రాజులు, భోగలాలసులు, నేను సాధు వును-యోగిని, మీ ప్రార్థన నంగీకరింప"ననిరి. కాని మహారాజు

వారిని వదలక వారి కుటీరము వరకు వెళ్లి వినయముతో మరీ మరీ ప్రార్థించినందున మహారాజు తనవద్ద ప్రతిదినము మూడు గంటలు సంస్కృతము చదువుకొనవలెననియు, అట్లు చదువుటకు రాకున్న ఆ దినమే తాను అల్వార్ వదలి వెళ్లిపోవు ననెడు నియమముపై అల్వార్ పోవుట కంగీకరించిరి. మహారాజు ఆ నియమమును స్వీకరించి వారిని అల్వార్ తీసుకపోయి రాజ ప్రాసాదమున నివాసాదులకు ప్రత్యేక వ్యవస్థ యొనర్చెను. మహా రాజు శ్రద్ధతో ప్రతిదినము నియమ పూర్వకముగ స్వామీజీ వద్ద సంస్కృతము నభ్యసించుచుండిరి. కాని ఒకనాడు వినోద గోష్ఠిలో మునిగియుండి స్వామీజీ వద్దకు చదువు కొనుటకై వెళ్లలేక పోయిరి. మరుసటి దినమున మహారాజు స్వామీజీని దర్శించుకొనగా వారు. తాము అల్వార్ విడిచివెళ్లుటకు నిశ్చయించు కొన్న విషయం తెలిపి "మీరు మీ ప్రతిజ్ఞను భంగ మొనర్చితిరి. కాని నేను మాత్రము నా ప్రతిజ్ఞను భంగమొనర్చ లేను" అని తెలిపి తన పుస్తకములు మున్నగు వస్తువులనన్నిటిని అచటనే వదలి అల్వార్ వదలిపెట్టి సోరోం పట్టణము చేరుకొనిరి. అచట వారు అస్వస్థులైరి. బ్రతికెడు ఆశగూడ లేకుండెను. అయినను శిష్యులు, భక్తులు చేసిన నిరంతర సేవ వలన బ్రతికిరి. పిదప సోరోం నుండి వెళ్ళి భరతపూర్, మురసాన్ ద్వారా మథుర చేరుకొనిరి.

ఆర్ష గ్రంథములలోని జ్ఞానమును ప్రచారము చేయుటే స్వామి విరజానందుల వారి ముఖ్య జీవిత ధ్యేయమైయుండెను. సోరోంలోను, ఇతర చోట్లలోను వారు విద్యార్థులకు చదువుచెప్పు చుండిరి. ఇప్పుడు వారు మథురలో తన శిష్యులకు సంస్కృతము

మరియు ఆర్ష గ్రంథములను నియమముగా చదివించుటకై ఒక పాఠశాలను నెలకొల్ప నిశ్చయించిరి. అందుకై హోలీ ద్వారము (తిలక్ ద్వారము) మరియు విశ్రామ ఘట్టము మధ్య దారి ప్రక్కన గల ఒక రెండంతస్తుల భవనమును అద్దెకు గైకొనిరి. ఆ భవనము వైదిక ధర్మమును పునరుద్ధరించుటలో విశేష పాత్రి వహించినందున చిరస్మరణీయమైన చరిత్రను సృష్టించినది. స్వామీజీ ఇందే నివసించుచు పాఠశాలను నిర్వహించుచుండిరి. వారి వైదుష్యము మరియు నవీన బోధనాశైలి యొక్క ఖ్యాతి వ్యాపించిన కొలది విద్యార్థుల సంఖ్య వృద్ధికాసాగెను. విద్యార్థుల నుండి శుల్కమేమియు తీసుకోబడెడిది కాదు. భరతపురపు మహారాజైన బలవంతసింహుడు, జయపురాధీశుడైన రామ సింహుడు, అల్వర్ మహారాజైన వినయసింహుడు మరియు స్వామీజీ భక్తులు ఒసగిన దానములే పాఠశాల నిర్వహణకు తోడ్పడుచుండెను.

అనార్ష గ్రంథములన్న స్వామీజీకి పరమవిరోధము. అవి అప్రామాణికములని వాని పఠనమును నిషేధించుచుండిరి. ఆర్ష గ్రంథములు ప్రామాణికములని వాని అధ్యయనమును బల పరచుచు వానినే చదివించుచుండిరి. సిద్ధాంత కౌముది, శేఖర చంద్రిక, మనోరమ మున్నగు ఆధునిక వ్యాకరణ గ్రంథములు త్యాజ్యములని స్వామీజీ చెప్పుచుండిరి. వీని అధ్యయనాధ్యాపన ముల వలననే శాస్త్రములకు భాష్యము లొనర్చుటలో భయంకర ములైన పొరపాట్లు జరిగినవనియు అవి ధర్మక్షీణతకు ముఖ్య కారకములైనవనియు వారనుచుండిరి. వీరి శిష్యులకు అన్యపండితు లకు మథురలో జరిగిన వ్యాకరణ విషయ శాస్త్రార్థమున వీరికి

కలిగిన యీ భావమును హరిద్వారమున స్వామి పూర్ణానందుల వారు ధ్రువపరచిరి. ఈ శాస్త్రార్థమున కాశీ పండితమండలి ధన, బలప్రయోగ మొనర్చి స్వామి విరజానందుల సత్యమైన పక్షమునకు విరుద్ధముగా తీర్పునిప్పించగలిగెను. పాణినీముని కృత అష్టాధ్యాయియే ఏకైక సంస్కృత వ్యాకరణ ప్రామాణిక గ్రంథమనియు, దీని ఆధారముననే వేదములకును, ఇతర ఆర్ష శాస్త్రములకును సరియైన భాష్యము చేయుట సంభవమనియు వీరి విశ్వాసమైయుండెను.

అధ్యాపన కార్యమనిన విరజానందులవారికి మిక్కిలి ప్రీతి వీరి అధ్యాపన కళానైపుణ్యము భారతదేశమంతట ప్రసిద్ధి చెందెను. వీరి ఖ్యాతి విని కాశీలో చదువుకొనవెళ్లిన వారందరు మథురకు వీరివద్ద చదువుకొనుటకై వచ్చెడివారు. పాఠశాల సమయము ముగియగనే వారి నివాసగృహ ద్వారము మూయబడెడిది తర్వాత వారిని కలిసికొనుటకు వచ్చిన వారికి దర్శనమీయకుండెడి వారు. కాని చదువు కొనుటకై వచ్చిన వారి కెల్లవేళలను వారి దర్శనము లభించెడిది. వారు విద్యార్థుల స్వరోచ్చారణ విషయములో కడు శ్రద్ధవహించెడి వారు.

స్వామీజీ కడు ఉగ్రస్వభావము గలవారు. తమ శిష్యుల యొక్కయు తమతో సంబంధము గల వ్యక్తుల యొక్కయు సామాన్య దోషములు గూడా సహించెడివారు కారు. ఎంత గొప్ప ఆపద సంభవించినను చలించెడివారు కారు. ఎప్పుడును ధైర్యమును కోల్పోవకుండిరి. వారి సంకల్ప శక్తి సాహస దృఢత్వములు అద్భుతములైనవి.

దేశ పతనావస్థను గాంచి అతడు కడు దుఃఖితుడును, చింతాక్రాంతుడగుచుండెను. వేదములు, ఆర్ష సాహిత్యము ఉపే క్షింపబడుట, అనార్ష సాహిత్యము, మతమతాంతరముల విస్తృత ప్రచార ప్రభావములను గాంచి వారికి చెప్పరాని మానసిక కష్టము కలిగెడిది.

ప్రథమ స్వాతంత్ర్య పోరాటము విఫలమైన పిదప క్రీ.శ ౧౮౫౯లో అప్పటిగవర్నరు జనరల్ అయిన లార్డ్ కేనింగ్ ఆగ్రాలో ఒక సమావేశము నేర్పాటు చేసిరి. అందు పాల్గొనుటకు రాజ పుత్ర స్థానమందలి రాజులందరును ఆహ్వానింపబడిరి. అందు వేదము మరియు ఆర్ష సాహిత్యము యొక్క ప్రామాణ్యతను గూర్చి చర్చించి విద్వాంసుల చేత వాని ప్రామాణ్యతను, అనార్ష సాహిత్యము మరియు మతమతాంతరముల అప్రామాణ్యతను అంగీకరింపజేసి అప్రామాణిక సాహిత్యమును పరిత్యజింపజేయు టకై స్వామి విరజానందులవారు జయపుర మహారాజైన రామ సింహుల ద్వారా అఖిల భారతీయ విద్వత్పరిషత్తును పిలిపించ యత్నించిరి. పరిషదుద్దేశము రామసింహ మహారాజునకు సమ్మత మైనప్పటికి స్వామివారి ప్రయత్నము సఫలముకాలేక పోయెను. తత్కారణమున స్వామీజీకి అత్యంత ఖేదము కలిగెను. ఏమి చేయవలెనో వారికి తోచకుండెను. ఆర్యజాతి దుర్దశను గూర్చి యోచించిన కొలది తవ యోజనయొక్క మహత్త్వము సుస్పష్ట మగుచుండెను.

ఇట్టి సమయమున స్వామి దయానందులు మథురా నగ రము చేరి ౧౪-౧౧-౧౮౬౦ నాడు సామి విరజానందుల గృహమునకేగి ప్రవేశమును కోరిరి. విరజానందులు వారిని

"నీ వెవర"వని యడుగ "మహాశయా! నేనెవరినో తెలిసికొనగోరియే మీ సన్నిధి కేతెంచితిని" అని విన్నవించుకొనిరి. అది విని విరజానందులు "నీవేమి చదివితి"వని యడుగ వ్యాకరణమే గాక కొన్ని గ్రంథముల చదివితినని దయానందులు సమాధాన మొసగిరి. తలుపులు తెరుచుకొనెను. వెంటనే దయానందులు స్వామీజీ పాదములనంటి ప్రణామమొనర్చి కూర్చుండిరి. అంతట స్వామీజీ "నా శిష్యుడవు కాదలచినచో నీవు చదివిన అనార్ష గ్రంథములలోని విషయములెల్ల మరచిపోవలసియుండును. ఏలన వాని ప్రభావమున్నంతవరకు నీవు వైదిక సాహిత్య ప్రకాశ మును గాంచలేవు. చూడు దయానందా! సంస్కృత సాహిత్య మును మహాభారతమునకు పూర్వపుసాహిత్యము, మహాభారతము తరువాత సాహిత్యము అని రెండుగా విభజింపవచ్చును. మహా భారతమునకు పూర్వపు సాహిత్యమున ఆర్యజనుల ఆధ్యాత్మిక, నైతిక, బౌద్ధిక శ్రేష్ఠత గోచరించును. ఆ కాలపు గ్రంథములు ఉన్నత జీవనులైన ఋషులచే రచింపబడెను. అవి భ్రాంతజను లకు ప్రకాశ స్తంభములయ్యెను. ఋషుల గ్రంథములను చదువుటవలన లాభము చేకూరును. మహాభారత యుద్ధానంత రము ఆర్షగ్రంథముల చదివించు అలవాటు క్షీణించి పక్షపాత ముచే అందులైనట్టి సంకీర్ణ ప్రవృత్తి గలవారు వ్రాసిన గ్రంథ ముల ప్రచారము అధికమై ధర్మమునకు గొప్పహాని కలిగెను. కావున నీవు ఆర్ష గ్రంథములనే చదువ వలసియుండును" అనిరి. సిద్ధాంత కౌముది రచయిత భట్టోజీ దీక్షితులనిన స్వామీజీకి అమిత కోపము. ఆ పుస్తకముగాని, అట్టివే యగు ఇతర పుస్తకములు గాని నీ వద్ద నున్నచో వానిని యమునలో పార

వేసి రమ్మని స్వామి దయానందుల నాదేశించిరి. స్వామి దయా నందులు అట్లే చేసిరి.

స్వామి విరజానందులు చదివించెడిశైలి సరళము, ఉత్తమము నైనందున విద్యార్థులు అష్టాధ్యాయిలో సులభముగా ప్రవీణులు కాగలుగుచుండిరి. స్వామి దయానందులు ఇదివరకే వ్యాకరణము నేర్చియున్నందున అష్టాధ్యాయిని త్వరలోనే పూర్తి చేసి మహా భాష్యమును గూడా చదివిరి. ఈ రెండింటి అధ్యయనము వలన దయానందులకు వైదిక మరియు అర్వాచీన సంస్కృత సాహిత్యమున గొప్ప పాండిత్యమలవడెను. ఆ పిదప వారు నిరుక్తము, నిఘంటువులనే గాక వేదార్థమును యథాతథముగ గ్రహించుటకు అవసరమైన ఇతర గ్రంథములన్నిటిని చదివిరి. దీని వలన వారికి మహాభారత కాలమునుండి మూతబడియున్న వేదకోశములను తెరచు తాళము చెవి లభించెను.

స్వామి విరజానందులకు మన్యువు అత్యధికముగా నుండెను. స్వల్పమైన అపరాధమునకు, నియతకర్మలో జరిగెడి కొద్దిపాటి ఏమరుపాటునకును వారు స్వామి దయానందుల నుపాలంబించుటయే గాక కఱ్ఱతో దండించెడివారు. ఒక దినమున దయానందులు గదిని శుభ్రపరచి చెత్తనొకమూలనుంచిరి. దైవయోగమున గురుదేవుల పాదమాచెత్తపైన పడెను. వారు కోపోద్రిక్తులై కఱ్ఱతో దండించిరి. ఆ కఱ్ఱ దెబ్బను సహించి దయానందు లిట్లనిరి "మహాత్మా! నా శరీరము వజ్రసమకఠోరమయినది. ఈ కఱ్ఱ దెబ్బ దాని నంతగా ప్రభావిత మొనర్చదు. కాని మమ్ముకొట్టునపుడు మీ కోమల హస్తములకు కలుగు కష్టము


మాకు దుఃఖకారణమగుచున్నది." శిష్యుని యీ మాటలు వినగానే గురుని హస్తముల నుండి కఱ్ఱజారి క్రిందపడెను. ఇన్ని కష్టముల సహించియు దయానందులు ఎంతో శ్రమకోర్చి నిష్ఠతో గురుసేవ చేయుచుండెడివారు. గురువు స్నానమునకై ప్రతి దినము యమునానదినుండి ఎన్నియో కడవల నీటిని తెచ్చెడివారు. నియమముగా గురువు గదిని శుభ్రము చేసెడివారు.

గురు దేవులతో శిష్యులెవరును తర్కవితర్కము చేయకుండిరి. కాని గురుదేవులకు స్వామి దయానందుల సందేహములను తీర్చవలసి వచ్చెడిది. దయానందుల బుద్ధికుశలత, తార్కిక శక్తి గురుదేవుల నత్యంత ప్రభావితమొనర్చి ప్రసన్నతను కలిగించెడిది. దయానందులకు బోధించునప్పుడు కలుగునట్టి ఆనందము ఇతర శిష్యులెవరికి బోధించిన కలుగకుండెడిది. ఒకసారి దయానందులు చదివిన పాఠమును మరచిపోయి దానిని మరొకమారు చెప్పుడని గురుదేవుల ప్రార్థింప పాఠమునకు బదులు చీవాట్లు మాత్రమే లభించెను. అంతేకాదు ఆ పాఠము వినిపింప లేకున్న యమునలో పడి మరణించుమని గురుదేవులు కఠినముగా పలికిరి. అది విని పాఠము స్మరణకు రాకున్న గురువునాజ్ఞ ప్రకారము యమునలో దూకి ప్రాణములు వదల గలనని ప్రతిజ్ఞ యొనర్చి దయానందులు యమునాతీరములోని విశ్రామ ఘట్టమునందొక వేదికపై కూర్చుండిరి. ఎన్నియో గంటలవరకు ఏకాగ్రతతో నాలోచించిన పిదప మరచిన పాఠము జ్ఞప్తికివచ్చెను. ఆనందాతిరేకమున ఆ పాఠమును గురుదేవులకు వినపింప పరుగిడిరి. గురుదేవులు సరియైన పాఠమును విని సంతోషముతో శిష్యుని ఆలింగనమొనర్చుకొనిరి.

అనతి కాలముననే దయానందులు గురువునకు అత్యంత ప్రియశిష్యులైరి. శిష్యునిగానే కాక సహచరునిగాను వారు విరజానందులకు అతి సన్నిహితులైరి. పాఠశాలానంతరము దయానందులు గురుదేవులతో వివిధ విషయముల గూర్చి చర్చించుచుండిరి. దయానందులు సాధారణ వ్యక్తికారని గ్రహించుటకు విరజానందుల కెంతోకాలము పట్టలేదు. శిష్యులందరిలో దయానందు లొకరే సత్యముపై శిలవలె స్థిరముగా నిలిచియుండగల మేధావి యనియు, లోకమునకు వెలుగు చూపగలవాడనియు వారికి స్పష్టమయ్యెను. వారి హృదయములో గల కోర్కెల దీర్చ గలవాడాతడే యని వారికి విశ్వాసము కలిగెను. దయానందులే ఆర్ష సాహిత్యమును ప్రచార మొనర్చుచు మూఢవిశ్వాసముల పద్మవ్యూహములను అసత్యపు దేవీదేవతల అనుష్ఠానమును, అవైదికాచారములను రూపుమాపి వైదిక జ్ఞానజ్యోతిని వెలిగించగలడని విశ్వసించిరి.

దయానందులు గురుదేవుల చరణ సన్నిధిలో మూడు సంవత్సరములు గడపిరి విద్యాధ్యయన సమాప్తి యగుటతో గురుదేవుల కత్యంత ప్రియమైనవని అర్ధ శేరు లవంగములను గురుదక్షిణగా సమర్పించుటకు తెచ్చిరి. దయానందులు సన్యాసి కావున వారి నుండి విలువైన గురుదక్షిణ పొంద కోరిక విరజానందులకు లేకుండెను. దయానందుల వద్దలేని వస్తువును వారు కోరదలచలేదు. కావున వారు దయానందుల నాశీర్వదించి ఒక గొప్ప సందేశము నిచ్చిరి.

"వత్సా! భారతదేశమున దీనహీన జనులు అనేక విధములైన దుఃఖముల పాలగుచున్నారు. మతమతాంతరులలో ప్రబలియున్న కురీతులను నిర్మూలించుము. ఆర్యజనుల దుర్దశను బాగు



స్వామి దయానందుడు గురుదక్షిణగా లవంగముల సమర్పించుట.


పరచుము. ఋషిశైలిని ప్రచార మొనర్చి జనులలో వైదిక గ్రంథముల పఠనములందు అభిరుచిని కల్పించుము. లోకహిత భావనతో క్రియాశీల జీవితము గడుపుము. ప్రియమైన పుత్రా! ఇదియే నీనుండి నేను కోరునట్టి గురుదక్షిణ. దీనిని తప్ప ఇతర సాంసారిక పదార్థమును దేనిని నేను కోరను."

స్వామి దయానందులు గురుదేవుల వచనములను తూ.చ. తప్పకుండ స్వీకరించి "గురుదేవా! తమ ప్రియశిష్యుడు శ్రీగురుదేవుల యాజ్ఞలను ప్రాణములొడ్డియైనను పాలించుటను మీరు చూడగలరు" అని గద్గద స్వరముతో ననిరి. ఆ మాటలకు గురుదేవులు హర్షపులకిత గాత్రులై నతమస్తకుడై యున్న శిష్యుని శిరసుపై హస్తముంచి "సరే దయానందా! ఇక వెళ్లుము. ఈశ్వరుడు నీకు సుఖ సాఫల్యముల నొసగు గాక! నీవు సఫల మనోరథుడవగుదువు గాక!" అని యాశీర్వదించిరి.

ప్రాచ్య ఋషులిద్దరి అపూర్వ సమాగమమిది. విరజా నందులకు దయానందులవంటి (ప్రియ) ఇష్ట శిష్యుడును, దయా నందులకు విరజానందుల వంటి యోగ్య గురువును లభించిరి.

వి.సం. ౧౯౨౫ ఆశ్వయుజ బ. ౧౩ (దీ. ౧౪-౯-౧౮౬౮) నాడు ౯౦ సంవత్సరముల వయస్సున సామాన్య అనారోగ్యమునకు గురియై స్వామి విరజానందులు పరమపదించిరి.

స్వామి దయానందులు గురుదేవుల కఱ్ఱ దెబ్బల గుర్తులను మిక్కిలి అభిమానముతో చూచుచు "ఇవి నాగురువుకు నాయెడ గల ప్రేమకు చిహ్నము" లనుచుండిరి. గురుదేవుల మృత్యు సమాచారము విని స్వామి దయానందులు అత్యంత దుఃఖముతో దీర్ఘనిశ్వాసము వదలి "హా! నేడు వ్యాకరణ సూర్యుడస్తమిం



నీవు సఫల మనోరథుడవగుదువు గాక! యని స్వామి దయానందున్ని ఆశీర్వదించుట.

చెను'' అనిరి. స్వామి దయానందులు తమ గ్రంథములన్నింట గురుదేవులను మాటిమాటికి స్మరించిరి. తానొనరిచ్చిన వేద భాష్య ప్రతి అధ్యాయము చివర "ఈ యధ్యాయము యొక్క భాష్యము పరమహంస పరివ్రాజకాచార్యులైన స్వామి విరజానందుల శిష్యుడు దయానందుడొనర్చెను" అని వ్రాసిరి.

దయానంద విరజానందుల కలయిక జరుగకున్న మనకు స్వామి దయానంద మహర్షి లభించెడివారు కారు. మహా మనీషి యైన స్వామి విరజానందుల గొప్పధనము అగాధమును, గహనమునునైన వారి వైదుష్యమునందే కాక వారి విశాలదృక్పథము నందు నిమిడియున్నది. వారు తమ దివ్యదృష్టితో భారతదేశము యొక్క రుగ్మతను దూరమొనర్చుటకు వైదికధర్మ విశుద్ధ స్వరూపమును పునరుద్ధరించి వైదిక ఆదర్శములను ఆచరణలో నుంచుటయే సరియైన ఔషధమని గ్రహించిరి. ఇవియే సర్వాంగీణ ఉన్నతిని, సుఖ సమృద్ధిని సాధించి రక్షించుకొను సాధనములు. నేత్రహీనులే గాక శారీరికముగను అశక్తులగుటచే వారు తమ భావములను, కోరికలను హృదయమందే పదిల పరచుకొనవలసి వచ్చెడిది. వారి సుయోగ్య శిష్యులైన స్వామి దయానందులు వారి స్వప్నములను సాకారమొనర్చి వారిని అమరుల నొనర్చిరి స్వామి విరజానందులు భారతదేశపు గురుశిష్య పరంపరకు భవ్య రూప మొసగి స్వామి దయానందులవంటి తేజో పుంజరత్నము నిర్మించిరి. అది అనంత కాలమువరకు తన కాంతిని ప్రపంచమంతటను ప్రసరింప జేయుచు తన చతుర శిల్పియైన స్వామి విరజానందుల వారిని ప్రకాశింపజేయుచుండును.

ఓ౩మ్ శమ్

———